*** గరిష్ఠం 29.0 కనిష్ఠం 21.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.00 (120.0900)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.66)	59.87	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	98.91 (0.68)	371	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.136 | డ్రెస్ : రూ.194 | స్కిన్‌లెస్ : రూ.220

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తికి ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయడంతో పాటు, అవసరమైన నిధులు సుమారు రూ.2,200కోట్లను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదలచేస్తామని ప్రకటించడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆయకట్టుకు ఇప్పటికే ఏఎమ్మార్పీ ఎత్తిపోతల ద్వారా చెరువులు నింపి నీటిని అందిస్తున్నా, సొరంగమార్గం పూర్తయితే శాశ్వత ప్రాతిపదికన గ్రావిటీ ద్వారా నీరు లభించనుంది. మరోవైపు హైదరాబాద్ మహానగరానికి తాగునీటి పేరుతో సాగు నీటి తడులు నిలిపే దుస్థితి తప్పనుంది. రెండేళ్లలో పథకం పూర్తికి అవసరమైన కార్యాచరణ ప్రారంభమవగా, అంచనా వ్యయం పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో టీబీఎం (టన్నెల్ బోరింగ్ మిషన్)లో మరమ్మతుకు గురైన బేరింగ్, ఇతర పరికరాలను కాంట్రాక్ట్ సంస్థ తెప్పిస్తోంది. మొత్తంగా ప్రాజెక్టు పనులు మళ్లీ మొదలవుతాయనే సంకేతంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ



ఎస్ఎల్‌బీసీపై చిగురిస్తున్న ఆశలు

- రెండేళ్లలో పూర్తికి ప్రభుత్వం కార్యాచరణ
- ప్రస్తుతం 9.5కి.మీ సొరంగం పనులు పెండింగ్
- పెరిగిన అంచనా వ్యయం
- కీలక అనుమతులు, భూసేకరణపై దృష్టి
- ఆగస్టు నుంచి మళ్లీ పనులు ప్రారంభమయ్యే అవకాశం

9.5కి.మీ సొరంగం పూర్తయితే గ్రావిటీ ద్వారా నీరు

ప్రాజెక్టులో కీలకమైన టన్నెల్-1లో 43.930కి.మీ సొరంగాన్ని 10మీటర్ల డయాతో తవ్వుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీళ్లు తీసుకునే ఇన్‌లెట్ వైపు నుంచి, నీరు విడుదలయ్యే అవుట్‌లెట్ నుంచి సొరంగం తవ్వకాలు చేపట్టారు. రెండువైపులా కలిపి మొత్తం 34.730కి.మీ సొరంగం తవ్వకం పూర్తికాగా, ఇంకా 9.560కి.మీ తవ్వాల్సి ఉంది. మొదటి టన్నెల్‌కు, రిజర్వాయర్ నడుమ ఉన్న 1.125కి.మీ లింక్ కెనాల్ దాదాపు పూర్తయింది. ఈ టన్నెల్ తర్వాత నీటిని నిల్వ చేసేందుకు నిర్మించిన నక్కలగండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తికాగా, గేట్ల బిగింపు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా ముంపు బాధితులకు పునరావాసం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ తరువాత చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి వద్ద చేపట్టిన రెండో టన్నెల్ 7.130కి.మీ పూర్తిగా తవ్వకం పనులు పూర్తికాగా, సీసీ లైనింగ్ సంబంధించి 3.206కి.మీ పని పెండింగ్‌లో ఉంది. ఈ పనులు పూర్తయితే ఏఎమ్మార్పీ కింద ఇప్పటికే నిర్మాణమైన ప్రధాన కాల్వకు 25వ కిలోమీటర్ వద్ద ఈ నీటిని కలిపితే నల్లగొండ జిల్లాలోని పూర్తి ఆయకట్టుకు నీరందుతుంది. దిగువన నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు నీరిచ్చే ఉదయసముద్రం-బ్రాహ్మణ వెల్లంల పథకానికి నీటి భరోసా దక్కుతుంది.

గత ప్రభుత్వ హయాంలో నామమాత్రమైన ప్రాజెక్టు

2007లో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు 2014 వరకు కొంత వేగంగానే సాగాయి. టన్నెల్-1లో విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో టీబీఎం (టన్నెల్ బోరింగ్ మిషన్) ద్వారా చేపట్టిన పనులకు తరచూ ఆటంకాలు కలుగుతుండడం పనుల కొనసాగింపునకు ప్రధాన ఆటంకంగా మారింది. అదే సమయంలో రాష్ట్రం ఏర్పాటవడంతో సొంత ప్రభుత్వంలో పనులు పుంజుకోకపోగా, పూర్తిగా మందగించాయి. దీంతో గత పదేళ్లలో టన్నెళ్లకు సంబంధించిన పనులు నామమాత్రంగా సాగగా, నక్కలగండి రిజర్వాయర్ పనులు మాత్రం దాదాపు ముగిశాయి.

ఆదినుంచీ నత్తనడకే..

ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం ప్రాజెక్టు ఆది నుంచి నత్తనడకనే నడుస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు కుడి వైపు నుంచి తమిళనాడు రాష్ట్రం చెన్నైకి తాగునీటి కోసం కాల్వ తవ్వాలనే ప్రతిపాదన వచ్చినప్పటి నుంచి నల్లగొండ, పాలమూరు జిల్లాల్లోని 3 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్‌పీడిత ప్రాంతాలకు తాగునీటిని అందించేందుకు ఎడమవైపున కాల్వ తవ్వాలనే డిమాండ్ ఉంది. ఎట్టకేలకు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.480కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు రిపోర్ట్ సిద్ధం చేసింది. ఆ తర్వాత ఈ ప్రయత్నం ముందుకు సాగలేదు. తిరిగి 1995లో జీవో 55 ద్వారా నాగార్జునసాగర్ ఆధారంగా ఎస్ఎల్‌బీసీ ఎత్తిపోతల పథకాన్ని (ఏఎమ్మార్పీ) నల్లగొండ జిల్లా సాగు, తాగునీటి అవసరాలతోపాటు, హైదరాబాద్ మహానగరానికి తాగునీటి కోసం చేపట్టారు. ఈ పథకం కింద రిజర్వాయర్లు, కాల్వలతో పాటు డిస్ట్రిబ్యూటరీలను నిర్మించారు. అయితే ఎస్‌ఎల్‌బీసీకి గ్రావిటీతో నీరు తీసుకునే అవకాశమున్న సొరంగ మార్గాన్ని చేపడితేనే శాశ్వత పరిష్కారమనే డిమాండ్లు వెల్లువెత్తాయి. దీంతో 2005లో జలయజ్ఞం ప్రాజెక్టుల్లో భాగంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టును జీవోనెం.147 ద్వారా రూ.2,813 కోట్ల వ్యయంతో మంజూరు చేయగా, ఢిల్లీకి చెందిన జయప్రకాష్ అసోసియేట్స్ సంస్థ ఈ పనులు దక్కించుకుంది. 2007లో పనులు ప్రారంభం కాగా, సుమారు మూడేళ్లలో పూర్తిచేయాలన్నది లక్ష్యం. అయితే 17 ఏళ్లు గడిచినా నేటికీ పనులు పూర్తికాలేదు.



పెరుగుతూ వచ్చిన అంచనా వ్యయం

టన్నెల్ ప్రాజెక్టు చేపట్టడం మొదలు పనుల పూర్తి వరకు అన్ని దశల్లో, అన్ని సందర్భాల్లో విపరీత జాప్యం కారణంగా ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా అదే స్థాయిలో పెరుగుతూ వచ్చింది. ఈ ప్రాజెక్టుకు తొలుత 1983-84లో రూ.480కోట్లు అవసరమవుతాయని భావించారు. ఆ తరువాత 1995లో ప్రాజెక్టు వ్యయం రూ.2,813కోట్లుగా అంచనా వేశారు. ఆ తరువాత నూతన రాష్ట్ర ఏర్పాటు అనంతరం వచ్చిన ప్రభుత్వం అంచనా వ్యయాన్ని రూ.3,172కోట్లకు పెంచింది. తాజాగా, ఇటీవల సమీక్షల అనంతరం పథకం పూర్తికావాలంటే రూ.4,658కోట్లకు అంచనా వ్యయం పెంచాలని ఇంజనీరింగ్ వర్గాలు ప్రతిపాదించగా, ప్రభుత్వం ఆమోదించినట్లు సమాచారం. అందులో భాగంగానే గ్రీన్‌ఛానల్ ద్వారా రూ.2,200కోట్లు ఉంచాలని నిర్ణయించినట్లు చర్చ సాగుతోంది. ఈ వారంలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఆ మేరకు కేటాయింపులు ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు సుమారు రూ.2,700కోట్ల నిధులు ఖర్చుచేశారు.

రెండేళ్లలో పూర్తి చేయాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని రెండేళ్లలో వందశాతం పూర్తిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. ఉమ్మడి జిల్లాకే చెందిన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం ఈ ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలనే దృఢసంకల్పంతో అధికారులు, ఏజెన్సీతో సమీక్ష నిర్వహించారు. పనులు ముందుకు సాగేందుకు వీలుగా పెండింగ్ బిల్లులు క్లియర్ చేయించడంతో పాటు, భూసేకరణపై దృష్టిసారించారు. అదే సమయంలో టన్నెల్-1లో ఇన్‌లెట్ వైపు పనుల నిర్వహణలో ఆటంకంగా ఉన్న సీపేజ్ నీటి తోడివేత, గ్రౌటింగ్ పనులు కొనసాగించేందుకు చర్యలు తీసుకున్నారు. మరోవైపు కీలకమైన అవుట్‌లెట్ వైపు పనుల కొనసాగింపునకు అవసరమైన టీబీఎం బేరింగ్, ఇతర పరికరాలను తెప్పించాలని ఏజెన్సీని ఆదేశించి, ఆగస్టు నుంచి పనులు వేగంగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు. మరోవైపున పనులకు అవసరమైన నిధుల కొరత లేకుండా ఉండేందుకు, ప్రాజెక్టు పూర్తికి అవసరమని అంచనావేసిన రూ.2,200కోట్లను గ్రీన్‌ఛానల్‌లో ఉంచేందుకు నిర్ణయించారు.

భూసేకరణే కీలకం



ఎస్ఎల్‌బీసీ పనుల పూర్తికి భూసేకరణ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కీలకంగా ఉన్న నక్కలగండి రిజర్వాయర్‌లో కలిసే అటవీశాఖ భూములకు అనుమతి రావాల్సి ఉంది. ఈ రిజర్వాయర్‌లో కలిసే అటవీశాఖ భూములకు ప్రత్యామ్నాయంగా చందం పేట మండలంలోని కాచరాజుపల్లి, పెద్దమునిగల్ ప్రాంతాల్లో భూములు ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. మరోవైపు మూడు ముంపుతండాలకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు నిర్మించి ఇవ్వాల్సి ఉంది. అదేవిధంగా బ్రాహ్మణవెల్లంల కాల్వలకు ఇంకా 2,330 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. వీటితోపాటుగా పెండ్లిపాకల రిజర్వాయర్‌కు, ఇతర కాల్వల నిర్మాణానికి మరో వెయ్యి ఎకరాల వరకు భూమి అవసరమవుతుందని భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి విజిట్

ఉత్తిమాటలే..

ఎత్తిపోసేదెన్నడో

• 7 లో..



యాదగిరిగుట్టపై క్యూలైన్‌లో కిటకిటలాడుతున్న భక్తులు

యాదగిరికొండపై భక్తుల రద్దీ

- నిత్యాదాయం రూ.45.68లక్షలు
- తిరుపతి తరహాలో భక్తులకు ఏర్పాట్లు
- లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు
- నేడు గిరిప్రదక్షిణ, వన మహోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

భువనగిరి అర్బన్, జూలై 14: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో ఆదివారం యాదగిరికొండపై రద్దీ నెలకొంది. ఆషాఢమాసం అయినప్పటికీ వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వాహనాలపై యాదగిరికొండకు చేరుకున్నారు. సుమారు 30వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. వీఐపీ టికెట్ దర్శనానికి గంట సమయం, ధర్మదర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 45,68,806 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

తిరుమల తిరుపతి తరహాలో ఏర్పాట్లు: అఖండ దీపారాధనకు భక్తులు కొబ్బరికాయలు సమర్పించేందుకు ఒకేచోట అధికారులు శాశ్వత ఏర్పాట్లు చేస్తున్నారు. తూర్పురాజగోపురం ఎదురుగా ధర్మదర్శనం గోల్డెన్ క్యూలైన్‌లో ఇది వరకే కొబ్బరికాయలు కొట్టేందుకు స్థలం ఏర్పాటు చేయగా, ప్రత్యేక దర్శన భక్తులకు అవకాశం లేదు. రూ.150 టికెట్ దర్శన భక్తులు తమ వెంట తెచ్చుకున్న కొబ్బరికాయలను తూర్పురాజగోపురం వద్దే వదిలివెళ్లటం విమర్శలపాలైంది. దీంతో తిరుపతి తరహాలో అఖండ దీపారాధన, కొబ్బరికాయలు కొట్టేందుకు ఈశాన్య దిశలో ప్రత్యేకంగా నిర్మాణం మొదలుపెట్టారు. తూర్పురాజగోపురం, త్రితల రాజగోపురం మధ్యన వర్షం కురిస్తే భక్తులు ఇబ్బంది పడుతుండటంతో రెండు గోపురాల నడుమ షెడ్డు ఏర్పాటు చేశారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు: సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట ఆలయంలో స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు.

నేడు గిరిప్రదక్షిణ, వన మహోత్సవం: తెలంగాణకే తలమానికంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి చెంత ప్రతి నెల గిరిప్రదక్షిణ చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత నెల చేపట్టిన గిరిప్రదక్షిణలో ఊహించని రీతిలో 10వేల మంది భక్తులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం జరిగిన నేపథ్యంలో సోమవారం ప్రదక్షిణలో భారీగా భక్తులు భాగస్వాములు కావొచ్చని అధికారులు భావిస్తున్నారు. కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్లు కొనసాగే ఈ గిరి ప్రదక్షిణ 6.05గంటలకు వైకుంఠ ద్వారం నుంచి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతోపాటు కలెక్టర్ పాల్గొననున్నారు. గిరిప్రదక్షిణ సమయంలో వ్రత మండపం, సంస్కృత పాఠశాల, అన్నదాన సత్రం, గిరిప్రదక్షిణ రోడ్డుకు ఇరువైపులా, మల్లాపురం వద్ద గోశాల తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండు వేల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.



ప్రాకార మండపంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భూ విలువల సవరణపై వెనకడుగు?

- నిలిచిన సమీక్షా సమావేశం
- అటకెక్కిన కొత్త మార్గదర్శకాలు
- డైలమాలో రాష్ట్ర ప్రభుత్వం

నల్లగొండ, జూలై 14: ప్రభుత్వం భూముల విలువల సవరణపై తీసుకున్న నిర్ణయం నుంచి వెనకడుగు వేసింది. ఉమ్మడి జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో జూన్ 18వ తేదీ నుంచి వారం రోజుల పాటు భూ విలువల సవరణపై క్షేత్రస్థాయి అధ్యయనం చేసిన అధికారులు ఇచ్చిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం సున్నితంగా తిరస్కరించింది. అంతేగాక లోపాలను సవరించాలని, ప్రజలపై భారం పడకుండా తిరిగి అధ్యయనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ఈనెల 10న నల్లగొండలో సమీక్షా సమావేశం నిర్వహించాలని, నూతన మార్గదర్శకాలపై అధికారులకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. అయితే ఈ సమావేశం వాయిదా పడింది. దీంతో భూముల విలువల సవరణపై ప్రభుత్వం పునరాలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. మండలాలు, పట్టణాలు, నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాలు సహా మార్కెట్ విలువలను అధికారులు ఇష్టానుసారంగా పెంచడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్న భావనతో ప్రభుత్వం డైలమాలో పడినట్టు సమాచారం.

నూతన మార్గదర్శకాలు లేనట్టే

కొత్తగా చేపట్టే అధ్యయనానికి నూతన మార్గదర్శకాలు విడుదల చేయాల్సి ఉంది. గతంలో విడుదల చేసిన మార్గదర్శకాలతో సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు సంయుక్తంగా క్షేత్రస్థాయి అధ్యయనం చేశారు. భూముల విలువలను ఇష్టారాజ్యంగా ఎక్కువగా చూపించడంతో సమస్య మొదటికొచ్చింది. ఆస్తుల కొనుగోలుదారులపై తీవ్ర భారం పడేలా 60శాతానికి పైగా మార్కెట్ విలువ పెంపునకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీంతో ఆస్తుల కొనుగోలుదారులపై స్టాంప్ డ్యూటీ భారం భారీగా పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఆలోచనలో పడింది. భూముల రిజిస్ట్రేషన్ల విలువలు పెంపు శాస్త్రీయబద్ధంగా లేకపోవడం, మార్కెట్ విలువల, రిజిస్ట్రేషన్ విలువ మధ్య భారీగా వ్యత్యాసం ఉండటంతో ప్రజల నుంచి విమర్శలు రాకముందే శాస్త్రీయ పద్ధతిలో భూ విలువల సవరణ చేయాలని ప్రభుత్వం తిరిగి ఆదేశించింది. అయితే అందుకు నూతన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయలేదు.

జాప్యానికి కారణాలు అనేకం

భూముల విలువల సవరణ జాప్యానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖతో పాటు రెవెన్యూ శాఖలో సైతం ఈ నెలలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఇది కూడా భూ విలువల అధ్యయనానికి అడ్డంకిగా మారింది. ఆగస్టు 1 నుంచి పెంచిన భూ విలువలు అమలులోకి తీసుకురావాలని తొలుత భావించిన ప్రభుత్వం, విలువల సవరణ శాస్త్రీయబద్ధంగా లేదనే కారణంతో దీన్ని వాయిదా వేసి మళ్లీ అధ్యయనం చేయాలని ఆదేశించింది. సమీక్షా సమావేశాన్ని సైతం నిలిపివేయడంతో భూముల సవరణపై ప్రభుత్వం అయోమయంలో పడినట్టు తెలుస్తోంది. మొదటి నుంచి ప్రభుత్వం ఆస్తుల కొనుగోలుదారులపై భారం తక్కువగా ఉండేలా ముందుకు సాగాలనే అభిప్రాయంతో ఉంది. అయితే మార్కెట్‌లో ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ధరలు ఉండటంతో అధికారులు సైతం ఎలా ముందుకు సాగాలో తెలియక తోచిన విధంగా సవరణలు చేసినట్టు విమర్శలు ఉన్నాయి. దీంతోనే అసలు సమస్యలు తెరపైకి వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాల్సిన అధికారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు.

నివేదికను నిలిపివేస్తారా? అమలు చేస్తారా?

గతంలో సైతం బీఆర్ఎస్ ప్రభుత్వం భూ విలువల సవరణ సమయంలో తొలుత వెనకడుగు వేస్తుందని అంతా భావించినప్పుడు అనూహ్యంగా అధికారులు పంపిన నివేదికను ఆమోదించి ఆస్తుల కొనుగోలుదారులపై స్టాంపు డ్యూటీ భారాన్ని మోపింది. ప్రస్తుత ప్రభుత్వం సైతం ఇప్పటికే ఇచ్చిన అధికారుల నివేదికను ఆధారంగా చేసుకొని అమలు చేసినా ఆశ్చర్యం లేదన్నా చర్చ సాగుతోంది. బీఆర్ఎస్ హయాంలో భూముల విలువల సవరణకు ఆమోదం వేసే మూడు రోజుల వరకు కూడా ప్రజలకు తెలియని పరిస్థితి ఉండేది. అకస్మాత్తుగా అప్పటి ప్రభుత్వం నిర్ణయం వెల్లడించేది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అలానే ఇచ్చిన నివేదికలను ఆమోదిస్తుందన్న చర్చ సాగుతోంది. ఓ వైపు స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ, మరో వైపు రెవెన్యూ శాఖ సంయుక్తంగా ఇచ్చిన నివేదికలు డొల్లగా ఉండటంతో భూ విలువల సవరణ గందరగోళంగా మారింది. మరి ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సి ఉంది.



సమయం పట్టే అవకాశం ఉంది

భూముల విలువల సవరణపై ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో స్పష్టత లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా భూముల విలువల సవరణ ప్రక్రియ కొనసాగుతుంది. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా యంత్రాంగం ముందుకు వెళ్తుంది.

రవి, ఉమ్మడి నల్లగొండ జిల్లా రిజిస్ట్రార్ (ఎఫ్ఏసీ)

అధిక డబ్బుకు ఆశపడి మోసపోవద్దు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 14: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి అంటూ, అధిక రాబడికి ఆశపడి మోసపోవద్దని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. అధిక రాబడి వాగ్దానాలతో మోసగాళ్లు సోషల్ మీడియా ద్వారా ఆకర్షిస్తున్నారని పేర్కొన్నారు. జెఫరీస్ ఎంటర్ ప్రైజెస్, సాక్షిసింగ్ మోతీలాల్ ట్రేడ్ వంటి నకిలీ మొబైల్ యాప్ ద్వారా డబ్బును వేర్వేరు బ్యాంకు అకౌంట్ల ద్వారా జమ చేసి వాట్సప్ ద్వారా పరిచయమై అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాలని వాట్సప్ కాల్ మాట్లాడుతున్నారని తెలిపారు. వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసి నమ్మించి పెట్టుబడి పెట్టేలా చేసి అధిక లాభాన్ని ఆశ చూపి విత్‌డ్రాకు అవకాశం లేకుండా మోసానికి పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి మోసపూరిత నకిలీ స్టాక్ మార్కెట్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి ఘటనపై కేతేపల్లి పీఎస్‌లో ఓ కేసు నమోదైందన్నారు. జెఫరీస్ ఎంటర్ ప్రైజెస్, సాక్షిసింగ్ మోతీలాల్ ట్రేడ్ వంటి నకిలీ మొబైల్ యాప్ ద్వారా బాధితుడు సుమారు రూ.11లక్షల వరకు నష్టపోయాడని తెలిపారు. జిల్లా ప్రజలు నకిలీ స్టాక్ మార్కెట్ యాప్‌లకు ఆకర్షితులు కావొద్దని, ఇలాంటి వాట్సప్ కాల్స్ వస్తే నంబర్లను బ్లాక్ చేయాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే హెల్ప్‌లైన్ 1930కి కాల్‌చేసి తెలపాలన్నారు. లేదంటే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలన్నారు.



మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న ఎస్పీ

నేటి పోలీస్ గ్రీవెన్స్ డే రద్దు

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌డే ఈ సోమవారం రద్దయింది. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అందుబాటులో లేని కారణంగా పోలీస్ గ్రీవెన్స్‌డేను రద్దు చేస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారు దీన్ని గమనించాలని జిల్లా పోలీస్‌శాఖ సూచించింది.

గుత్తాను కలిసిన ఎస్పీ

నల్లగొండ రూరల్: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డికి ఎస్పీ పూల మొక్కను అందజేశారు.

ప్రజా సమస్యలపై దృష్టిసారించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి

మిర్యాలగూడ, జూలై 14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను అమలుచేసేలా దృష్టిసారించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలలు గడుస్తున్నా, మూడింటినైనా సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. పార్టీ ఫిరాయింపులపై పెట్టిన శ్రద్ధ ప్రజాసమస్యల పరిష్కారంపై చూపడం లేదన్నారు. వాతావరణ అనుకూలంగాలేని గడ్డు పరిస్థితుల్లో రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతుండగా రైతుభరోసాపై ప్రభుత్వం అభిప్రాయ సేకరణతో కాలం వెళ్లదీస్తోందన్నారు. రుణమాఫీ కాలేదని, ధరణి, ఎరువులు, విత్తనాల సమస్యలు రైతులను వెంటాడుతున్నాయన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు 13 అంశాలపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల పాలనలోని వైఫల్యాలను సవరించుకోకుండా మరింత దూకుడుగా ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. సింగరేణి గనుల ప్రైవేటీకరణ పూనుకోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర బీజేపీ ఎంపీలు, మంత్రులు కాంగ్రెస్‌పై విమర్శలతోనే కాలం వెళ్లదీస్తున్నారు తప్ప నిధులు తీసుకరావడంపై దృష్టి సారించడం లేదన్నారు. ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ కేవలం రెండు స్థానాలు మాత్రమే గెలుచుకోవడం ద్వారా ఆ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు అద్దం పడుతోందన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, రెమిడాల పరుశరాములు, పాదూరి శశిధర్‌రెడ్డి, పగిడోజు రాంమూర్తి, పత్తిపాక అప్పారావు, ఉన్నాం వెంకటేశ్వర్లు, చారీ, తదితరులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- దొంగల ముఠా అరెస్ట్‌
- 70 గ్రాముల బంగారం
- 3 సెల్‌ఫోన్లు, బైక్‌ స్వాధీనం

నాగార్జునసాగర్‌, జూలై 14: జల్సాలకు, మద్యపానం, ఇతర వ్యసనాలకు అలవాటు పడి డబ్బుల కోసం చైన్‌ స్నాచింగ్‌, దొంగతనాలు చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు నిందితుల వివరాలు వెల్లడించారు. హాలియాకు చెందిన ఓ బాలుడు, హాలియా మండలం పంగవానికుంట కుందాల వేణు చిన్నచిన్న దొంగతనాలు చేస్తున్నారు. చోరీకి పాల్పడిన సొత్తును అనుముల మండలం ఇబ్రహీంపేటకు చెందిన గొట్టిముక్కల శ్రీనివాసచారి అనే వ్యక్తికి విక్రయిస్తూ అలా వచ్చిన డబ్బులతో జల్సా చేస్తూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో శ్రీనివాసచారి బంగారం తీసుకువస్తే ఎక్కువ డబ్బులు ఇస్తానని ఆశచూపాడు. దీంతో సదరు ఓ బాలుడు తన అమ్మమ్మ మెడలో ఉన్న 5 తులాల బంగారాన్ని వేణుతో కలిసి దొంగిలించాడు. దానిని హాలియాకు చెందిన శ్రీను అనే వ్యక్తికి రూ.60 వేలకు విక్ర యించి ఆ డబ్బుతో హైదరాబాద్‌కు పారిపోయారు. అక్కడ ఎల్బీనగర్‌లో ఓయో రూంలో గదిని అద్దెకు తీసుకుని తన మామ అంజన్‌కుమార్‌, మరో మైనర్‌ బాలుడితో కలిసి హాలియాకు చెందిన మైనర్‌ బాలుడు, వేణులు జల్సా చేశారు. డబ్బులు అయిపోవడంతో చైన్‌ స్నాచింగ్‌లు చేస్తే డబ్బులు ఎక్కువగా వస్తాయని నిర్ణయించుకొని అంజన్‌కుమార్‌ సాయంతో హైదరాబాద్‌లో యమహా బైక్‌ను అద్దెకు తీసుకున్నారు. ఆ బైక్‌పై ఈ నెల 4వ తేదీన హైదరాబాద్‌ నుంచి వస్తున్న క్రమంలో పెద్దవూర నుంచి సాగర్‌కు స్కూటీపై ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మెట్టు రూపారెడ్డిని అనుసరించారు. పెద్దవూర నుంచి సాగర్‌కు వచ్చి సాగర్‌ డౌన్‌ పార్కు వద్ద ఆమె మెడలో నుంచి 4 తులాల బంగారు చైన్‌, తాళి దొంగిలించారు. దానిని హాలియాకు తీసుకెళ్లి శ్రీనివాసచారికి ఇవ్వగా రూ.20 వేలు ఇచ్చాడు. ఆ డబ్బులు కూడా అయిపోవడంతో ఆదివారం ఇద్దరు మైనర్‌ బాలురు, అంజన్‌కుమార్‌, వేణు నలుగురు కలిసి సాగర్‌లో మరో దొంగతనం చేద్దామని వచ్చారు. సాగర్‌ హిల్‌కాలనీ బస్టాండ్‌ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా సీఐ బీసన్న, ఎస్‌ఐ సంపత్‌ తమ సిబ్బందితో కలిసి వారిని పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితుల నుంచి 70 గ్రాముల బంగారం, 3 సెల్‌ఫోన్లు, యమహా బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. కేసును ఛేదించడంలో సహకరించిన హాలియా సీఐ జనార్ధన్‌గౌడ్‌, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, సిబ్బంది శ్రవణ్‌, శేఖర్‌లను డీఎస్పీ అభినందించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నెల్లికల్ లిఫ్టు ఏర్పాటు ప్రాంతం



ఉత్తిమాటలే.. ఎత్తిపోసేదెన్నడో

● 2021లో 13లిఫ్టులకు నాటి ప్రభుత్వం శంకుస్థాపన ● నిధులు లేక నత్తనడకన పనులు ● ఎన్నికల ప్రచార అస్త్రాలుగానే లిఫ్టులు ● ఈ ప్రభుత్వ హయాంలోనైనా పూర్తయ్యేనా ?

'రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం.. ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల ద్వారా ప్రతి ఎకరానికీ సాగునీరు అందిస్తాం' అన్న నేతల మాటలు ఉత్తిమాటలుగానే మిగిలిపోతున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా రైతులకు సాగునీటి ఇబ్బందులు మాత్రం వెంటాడుతూనే ఉన్నాయి. 2021లో నాగార్జునసాగర్ ఉప ఎన్నిక ఫలితంగా సూర్యాపేట, నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధుల విన్నపాల మేరకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2021 ఫిబ్రవరి 10న తిరుమలగిరి(సాగర్) మండలంలోని ఎర్రచెరువుతండా వద్ద జరిగిన సభలో మొత్తం 13లిఫ్టుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో ఉమ్మడి జిల్లాలో లిఫ్టుల ఏర్పాటు పనుల ప్రారంభానికి తొలి అడుగు పడింది. అయితే నిధుల సమస్యలతో లిఫ్టుల పనులు నత్తనడకగా సాగుతున్న పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. లక్ష్యం మంచిదే అయినప్పటికీ నిధులు కేటాయించకపోవడం, అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో కొన్ని లిఫ్టుల పనులు మందకొడిగా సాగుతున్నాయి.

తిరుమలగిరి(సాగర్), జూలై 14: కృష్ణపట్టె రైతుల చిరకాల డిమండ్ దృష్ట్యా ఉమ్మడి ఏపీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో 4,200 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నెల్లికల్ లిఫ్ట్‌కు సుమారు రూ.58 కోట్లు మంజూరు చేసేందుకు జీవో జారీ చేశారు. అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఆ ప్రాంత ప్రజలు 2014 ఎన్నికల్లో అన్ని పార్టీల నేతలను నెల్లికల్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2018 అక్టోబరు 22న లిఫ్టు పనులను పూర్తి చేయకుంటే అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరిస్తామని ఉమ్మడిగా ప్రకటించారు. దీంతో అప్పటి పాలకులు దిగివచ్చి నెల్లికల్ లిఫ్టుకు నిధులు మంజూరు చేయడంతోపాటు అన్ని అనుమతులు తీసుకొచ్చి పనులను ప్రారంభిస్తామని హామీలు గుప్పించారు. అనంతరం 2021లో అప్పటి ఎమ్మెల్యే నోముల నరసింహయ్య మృతితో వచ్చిన ఉప ఎన్నిక సందర్భంగా ఈ పథకం మరోసారి తెరపైకి రాగా ఉప ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారడంతో నాటి సీఎం కేసీఆర్ నెల్లికల్ లిఫ్టుతోపాటు జిల్లాలోని ఆయా ఎమ్మెల్యేల విన్నపం మేరకు ఆయా నియోజకవర్గాల్లోని లిఫ్టులకు సైతం మోక్షం కలిగించి శంకుస్థాపన చేశారు. లిఫ్టును 18నెలల్లో పూర్తి చేస్తామని అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి ఉప ఎన్నికల సందర్భంగా సవాలు చేసినప్పటికీ అదీ అమలుకు నోచుకోలేదు.

లిఫ్టు వ్యయం రూ.692కోట్లు.. మంజూరైంది రూ.25కోట్లే

నెల్లికల్ లిఫ్టుకు రీడిజైనింగ్ చేయడం ద్వారా మండలంలోని కృష్ణపట్టె గ్రామాల్లో సుమారు 24,886 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని రిటైర్డ్ ఇంజనీర్ల బృందం సభ్యుల సిఫారసుతో అప్పటి సీఎం కేసీఆర్ దానికి ఆమోదం తెలిపి శంకుస్థాపన చేశారు. నిర్మాణానికి రూ.692కోట్ల వ్యయం అవుతుందని అంచనా చేశారు. రూ.539కోట్లకు పనులు పూర్తి చేస్తామని మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ పనులు దక్కించుకుంది. పంప్‌హౌస్ పనులను ప్రారంభించారు. మూడున్నర సంవత్సరాలుగా అప్పటి బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో లిఫ్టు నిర్మాణ పనులకు కేటాయింపులు చేసింది కేవలం రూ.25కోట్లు మాత్రమే. దశలవారీగా ఇస్తుండడంతో సంబంధిత కాంట్రాక్ట్ దక్కించుకున్న నిర్మాణ సంస్థ పనులను వేగంగా చేయలేకపోతుందని సమాచారం. ప్రస్తుతం పంప్‌హౌస్‌కు సంబంధించి స్టేజింగ్, సెంట్రింగ్, షట్టరింగ్‌తోపాటు 8వ లిఫ్టుకు సంబంధించిన కాంక్రీట్ పనులు నిర్వహిస్తున్నారు. మొత్తం లిఫ్టు పనుల్లో ఇప్పటివరకు కేవలం పదిశాతం పనులు మాత్రమే పూర్తయినట్లు తెలుస్తోంది.

పెండింగ్‌లోనే ఇంకా పలు పనులు

లిఫ్టుకు సంబంధించిన ప్రెషర్‌మెయిన్ పైపులైన్ల పనులు వన్యప్రాణుల అభయారణ్యం గుండా వేయాల్సి ఉండడంతో అటవీశాఖ అనుమతుల కోసం పలు నిబంధనలను పెట్టింది. పైపులైన్ వల్ల 9 ఎకరాల అటవీ భూమికి నష్టం కలుగుతుండడంతో ఆ భూమికి ప్రత్యామ్నాయంగా నెల్లికల్ రెవెన్యూ శివారులో సర్వే నెం.290/2లోని సుమారు 8.66ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు అప్పగించారు. అటవీప్రాంతంలో పనుల వల్ల మొక్కలు, చెట్లకు, వన్య ప్రాణులకు నష్టం కలుగుతుండడంతో 2020-21లో రూ.2.34కోట్ల పరిహారం ఇవ్వాలని సంబంధిత అటవీశాఖ అధికారులు ఇరిగేషన్ శాఖకు ప్రతిపాదనలు పంపారు. అప్పటి ప్రభుత్వం చెల్లింపులు చేయకపోవడంతో ప్రస్తుతం ఆ పరిహారం రెట్టింపు కానుందని తెలిసింది. పైపులైన్లు, డీసీలు, గ్రావిటీ కెనాల్స్, ప్రెషర్‌మెయిన్ పైపులైన్ పనులు, సర్జిట్యాంక్‌లు, డెలివరీ సిస్టంలు, పంట కాల్వల నిర్మాణాల సర్వే పనులు నేటికీ చేపట్టలేదు.

దశలవారీగా లిఫ్టు పనుల పూర్తికి యోచన

ప్రభుత్వానికి నిధుల సమస్య వెంటాడుతుండడంతో 25,886 ఎకరాలకు ఒకేసారి పనులను పూర్తిచేసే పరిస్థితి లేకపోవడంతో దశలవారీగా పనులను చేయాలని ప్రభుత్వం, అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఎర్రచెరువు, నెల్లికల్ గ్రామాల్లో 4,175 ఎకరాలకు, తునికినూతలతండాకు 1586 ఎకరాలు, సుంకిశాలతండాలో 2,251ఎకరాలు, తిమ్మాయిపాలెం 10920, చింతలపాలెం 8220, జమ్మనకోట 298, రాజవరం మేజర్ చివరి భూములకు 4వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసి లిఫ్టుకు శంకుస్థాపనలు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల సమస్యతో విడతలవారీగా పనులు పూర్తి చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. మొదట ఎర్రచెరువుతండా, నెల్లికల్ సమీప ప్రాంతాల్లో సుమారు 5వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందేలా మొదటి విడతలో పనులను పూర్తిచేయించి సాగునీరు అందించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

డీ-8,9 లిఫ్టుకు పూర్తిస్థాయిలో కలగని మోక్షం

అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి డిస్ట్రిబ్యూటరీ- 8,9 ద్వారా 28వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు సాగునీరు అందించాలని సుమారు 25 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం, అధికారులు ప్రతిపాదించారు. కాని 34 కిలో మీటర్ల మేర కాల్వలు ఉండడంతో చివరి రైతుల భూములకు సాగునీరు పారని పరిస్థితి నెలకొంది. దీంతో ఏఎమ్మార్పీ లోలెవల్ కెనాల్‌పై లిఫ్టు ఏర్పాటు చేయడం ద్వారా సుమారు 7200 ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించేందుకు గత ప్రభుత్వాలు ప్రతిపాదనలు చేశాయి. సాగర్ ఉప ఎన్నిక ఫలితంగా శంకుస్థాపన చేసిన లిఫ్టుల్లో డి-8,9 ఒకటి. లోలెవల్ కెనాల్‌పై మూడు భారీ సైజ్ మోటార్లు ఉండగా ఒకటవ మోటార్ ద్వారా డి-8,9 కాల్వలకు నీటిని అందించేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదించారు. అందుకు తగ్గట్లు భారీ సంప్, కాంక్రీట్ పనులు, మోటార్లు ఏర్పాటు చేసిన ప్రాంతం నుంచి సుమారు 550మీటర్ల మేరా కాల్వల వరకు పైపు లైన్లను ఏర్పాటు చేసే పనులను పూర్తి చేశారు. అయితే మోటార్‌పైపుకు నీటిని మళ్లించే బటర్‌ఫ్లయ్ వాల్వ్ సిద్ధంగా లేకపోవడంతో మూడు నెలల్లో పూర్తి చేయకలగిన పనులను మూడు సంవత్సరాల వరకు కొనసాగించారు. రైతుల నుంచి విమర్శలు వస్తుండడంతో పశ్చిమబెంగాల్‌లోని నిర్మాణ సంస్థ వద్ద ప్రత్యేకంగా ఆ వాల్వ్‌ను తయారు చేయించి ఉపఎన్నిక ముందు దాన్ని పంప్ పైపులైన్‌కు బిగించి నీటిని కాల్వలకు విడుదల చేసి అనధికారికంగా ట్రయల్‌రన్ పూర్తి చేశారు. అయితే పాతికేళ్ల క్రితం తవ్విన కాల్వలో పెద్ద ఎత్తున కంపచెట్లు, మట్టి, చెత్త పేరుకపోవడంతో కాల్వలో నీరు పారే పరిస్థితి లేదు.



కంపచెట్లతో మూసుకుపోయిన డి-8,9 కాల్వలు

శంకుస్థాపనతో సరి.. పనులు ఎప్పుడో మరి!

మాడ్గులపల్లి: గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.9.30 కోట్లతో మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని మాడ్గులపల్లి మండలంలోని తోపుచర్ల లిఫ్టును మంజూరు చేసింది. నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఎల్-14 స్టేజ్-1 పంప్‌హౌస్ నుంచి మాడ్గుల పల్లి మండలంలోని తోపుచర్ల, పుచ్చకాయలగూడెం, సీత్యాతండా, దేవతలబావిగూడెం, గణపతివారిగూడెం, బొమ్మకల్ గ్రామాల గొలుసుకట్టు చెరువులను నింపేందుకు లిఫ్టు మంజూరు చేస్తామని అప్పుడు కేసీఆర్ ప్రకటించారు. దీంతో అధికారులు భూములను సర్వే చేసి వేములపల్లి పరిధిలోని ఎల్-14 స్టేజ్-1 పంప్‌హౌస్ నుంచి తోపుచర్ల, పుచ్చకాయలగూడెం వరకు సుమారు 5.6కిలో మీటర్ల మేరా భూగర్భ పైపులైన్ వేసి చివరి చెరువులకు నీటిని నింపేందుకు ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపించారు. పుచ్చకాయలగూడెం గ్రామ శివారులో లిఫ్టును నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు లిఫ్టు పనులకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ అలసత్వం కారణంగా అప్పటి నుంచి పనులు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. లిఫ్టు పూర్తయితే వ్యవసాయ భూములు సాగులోకి వస్తాయని అనుకున్న రైతులకు నిరాశే మిగిలింది.



ఎల్-14 సెకండ్ పంప్‌హౌస్

లిఫ్టు పూర్తయితేనే చెరువులకు జలకళ

తోపుచర్ల లిఫ్టు ద్వారా గొలుసుకట్టు చెరువులను నింపేందుకు ప్రభుత్వం లిఫ్టును మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఈ లిఫ్టు ద్వారా మండలంలోని తోపుచర్ల, పుచ్చకాయలగూడెం, గణపతివారిగూడెం, బొమ్మకల్ గ్రామాల పరిధిలోని చిన్నచెరువు, పెద్దచెరువు, బల్లునానికుంట, ఊర చెరువు, ఊర కుంట, పాత బొమ్మకల్ చెరువులకు ప్రస్తుతం నీరందకపోవడంతో కేవలం దాదాపు 60ఎకరాలకు నీరు అందుతుండగా లిఫ్టు పూర్తయితే ఈ చెరువుల కింద సుమారు 316ఎకరాలకు నీరందే అవకాశం ఉంది. నిండు కుండలా మారడంతోపాటు సుమారు 315 ఎకరాల వ్యవసాయ భూములు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా భూగర్భజలాలు సమృద్ధిగా పెరిగి బోరుబావులకు నీరందే అవకాశం ఉంది. అదేవిధంగా చెరువులోకి సమృద్ధిగా నీరు చేరినట్లయితే భూగర్భజలాలు వృద్ధి చెంది బోరుబావుల కింద సుమారు మరో 500ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.

లిఫ్టును త్వరగా పూర్తి చేయాలి



చివరి చెరువులకు నీరు అందకపోవడంతో ప్రతిసారి భూములు సాగుచేసుకోలేకపోతున్నాం. నీటి కోసం ప్రతిసారీ వరదకాల్వ చుట్టు తిరిగినా చివరి చెరువులకు నీరందకపోయేది. మాజీ సీఎం కేసీఆర్ లిఫ్టు మంజూరుకి హామీ ఇవ్వడంతో సాగులోకి వస్తాయని ఆశ కలిగింది. అలసత్వం వహించకుండా అధికారులు లిఫ్టు పనులను త్వరితగతిన పూర్తిచేసి బీడుభూములకు నీరందించి రైతులను ఆదుకోవాలి.

- మాడుగుల సాయిలు (పుచ్చకాయలగూడెం రైతు)

అయిటిపాముల.. నెరవేరేనా రైతుల కల

కట్టంగూరు: కట్టంగూరు మండలంలోని అయిటిపాముల రిజర్వాయర్ వద్ద రూ.100కోట్లతో చేపట్టనున్న అయిటిపాముల ఎత్తిపోతల పథకం పనులు పది నెలల నుంచి నిలిచిపోయాయి. 2023 సెప్టెంబర్‌లో అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ఏర్పాటు చేసే ప్రాంతం వరకు సుమారు 500మీటర్ల మేర అప్రోచ్ కెనాల్ పనులు ప్రారంభించారు. కట్టంగూరు, శాలిగౌరారం, నకిరేకల్ మండలాల్లోని 11గ్రామాల్లోని 8వేలకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎత్తిపోతల పథకా నికి 240 ఎకరాలు అవసరముండగా ఉండగా అధికారులు భూసేకరణ చేసి సర్వే పనులు పూర్తిచేశారు. భూమి కోల్పోతున్న చాలామంది రైతులకు నష్టపరిహారం కూడా అందింది. చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన పాల్వాయి నర్సింహారెడ్డి, పాపయ్య అనే రైతులు తమకు సరిపడా నష్టపరిహారం ఇవ్వలేదని కోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే విధించడంతో పనులు నిలిచిపోయాయి.



అయిటిపాముల రిజర్వాయర్ వద్ద నిలిచిపోయిన కాల్వ పనులు

వెంటనే పనులు ప్రారంభించాలి



అయిటిపాములు రిజర్వాయర్ వద్ద లిఫ్టు ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల ఉన్న వేల ఎకరాల బీడు భూములు సస్యశామలం కానున్నాయి. కోర్టు కేసు వలన పనులు నిలిచిపోయాయి. గత కొద్ది సంవత్సరాల నుంచి ప్రాజెక్టు కింద కరువు విలయతాండవం చేస్తోంది. వెంటనే పనులు ప్రారంభించి రైతుల్లో ఆనందం నింపాలి.

● ఎడ్ల పెద్ద రాములు, చెర్వుఅన్నారం రైతు

ఇంకా ప్రాథమిక దశలోనే..

ఆంధ్రజ్యోతి విజిట్

దామరచర్ల: ఉమ్మడి దామరచర్ల మండలంలో మూడు భారీ ఎత్తిపోతల పథకాలకు అప్పటి సీఎం కేసీఆర్ ఆమోద ముద్ర వేశారు. అడవిదేవులపల్లి మండలంలోని చిట్యాల వద్ద ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన హాలియా వాగు కలుస్తుంది. ఈ ప్రాంతంలో నీటి వృథాను అరికట్టేందుకు దున్నపోతుల గండి వద్ద ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. రూ.219 కోట్ల వ్యయంతో 16కిలో మీటర్ల పైపులైన్ ద్వారా అడవిదేవులపల్లి మండలంలోని బాల్నెపల్లి, అడవిదేవులపల్లి, ఉల్సాయిపాలెం, చాంప్లాతండా, ముదిమాణిక్యం, చిట్యాల, మొల్కచర్ల తదితర గ్రామాల పరిధిలోని 12,610 ఎకరాల భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో పనులను ప్రారంభించారు. దున్నపోతులగండి ఎత్తిపోతల పథకం, అన్నమేరువాగుపై చేపట్టిన ఎత్తిపోతల పథకం పనులు మాత్రం ప్రాథమిక దశలోనే ఉన్నాయి. పథకం పనులు ఇప్పటివరకు కేవలం 4శాతం వరకే పూర్తయినట్లు సమాచారం.



మంగళదుబ్బతండా వద్ద ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్

మూసీ నదిపై..

మూసీ నది నీరు వృథాగా కృష్ణా నదిలో కలిసి దిగువ పులిచింతలకు వెళ్తుంది. దీంతో ఈ ప్రాంతంలో ఎత్తిపోతల అసరముందని అప్పటి ప్రభుత్వం రూ.229.90 కోట్లతో 12,610 ఎకరాల భూమిని సాగులోకి తెచ్చేందుకు మండలంలోని మంగళదుబ్బతండా సమీపంలో ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించింది. దీని ద్వారా కొండ్రపోల్, బొత్తలపాలెం, నూనావత్‌తండా, ధనియాలబండతండా, తెట్టెకుంట, మాన్‌తండా, జైత్రాంతండా, లావూరిబిక్యాతండా పరిధిలోని భూములకు సాగునీరు అందనుంది. మంగళదుబ్బ తండాలోని ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ నిర్మాణం కావస్తుండగా పైపులైన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అడవిదేవుపల్లి మండలంలోని దున్నపోతులతండా పథకంతోపాటు దామరచర్ల మండలంలోని రెండు ఎత్తిపోతల పథకాల పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి.

అన్నమేరువాగు ఆధారంగా..

ఎగువ ప్రాంతం నుంచి వృథా దామరచర్ల మండలంలోని తాళ్లవీరప్పగూడెం సమీపంలోని కృష్ణానదిలో అన్నమేరువాగు కలుస్తుంది. దీంతో ఈ ప్రాంతంలో బీడు భూములు అధికంగా ఉన్నప్పటికీ నీటిని వినియోగిం చుకునే అవకాశం లేదు. దీంతో ఈ ప్రాంతంలో ఎత్తిపోతలకు శంకుస్థాపన జరిగింది. రూ.75.93కోట్లతో తొమ్మిది కిలో మీటర్ల పైపులైన్ల ద్వారా బొత్తలపాలెం సమీపంలోని దుప్పలగట్టు వద్ద వజీరాబాద్ మేజర్ కాల్వలకు, నర్సాపురం చెరువు సమీపంలో మరో పైపు డెలివరి పాయింట్లకు ఏర్పాటు చేశారు. ఈ ఎత్తిపోతల పూర్తయితే దామరచర్లతోపాటు బొత్తలపాలెం, వాచ్యాతండా, నర్సాపురం, తాళ్లవీరప్పగూడెం, వాడపల్లి పరిధిలోని 5,875 ఎకరాల భూమి సస్యశ్యామలమవుతుంది.

ఎత్తిపోతల పథకాలు త్వరగా పూర్తిచేయాలి



చట్టూ నీరున్నా ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు అందని పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో ఎత్తిపోతల మంజూరు చేశారు. పూర్తిగా జాప్యం జరుగుతుండడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఎత్తిపోతల పథకాలు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం కనపడడం లేదు. ప్రభుత్వం స్పందించి దున్నపోతులగండి ఎత్తిపోతల పథకం త్వరితగతిన పూర్తిచేసి ఈ ప్రాంత బీడు భూములను సాగు భూములుగా మార్చాలి.

● సక్రునాయక్, దూద్యాతండా, అడవిదేవులపల్లి మండలం.

నిధులున్నా.. మరమ్మతుల్లో నత్తనడక

మేళ్లచెర్వు: హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో కృష్ణానదిపై ఉన్న పాత, కొత్త ఎత్తిపోతల పథకాలు ఈ వానాకాలం నాటికి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేది ప్రశ్నార్థకంగా మారాయి. ఈ ప్రాంతంలో గతంలో నిర్మించిన నక్కగూడెం, పెద్దవీడు, చౌటుపల్లి, దొండపాడు, గుండ్లపల్లి, రామచంద్రాపురం, వెల్లటూరు పథకాల ద్వారా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి, మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల్లోని 26,742 ఎకరాలకు సాగునీరు అందించే పథకాల మరమ్మతులతో పాటు దొండపాడు-2 నూతన పథకానికి శ్రీకారం చుట్టారు. భారీ పథకాల ద్వారా కంటే చిన్న చిన్న ఎత్తిపోతల పథకాల ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణం సాగులోకి వస్తుందనే ఉద్దేశంతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ పథకాల మరమ్మతులకు నిధులు విడుదల చేశారు.

నిధులు మంజూరైనా పూర్తికాని మరమ్మతులు

పాత ఎత్తిపోతల పథకాల మోటార్లకు, పైప్పు లైన్ మరమ్మతుల కోసం మంత్రి రూ.7.30 కోట్ల నిధులు మంజూరు చేసి ఆగస్టు 15నాటికి పూర్తిస్థాయిలో పూర్తిచేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువుకు ముందే పైపులైన్లు రిపేరు చేసి ట్రయిల్ రన్ నిర్వహించి, మోటార్లు, పైప్పు లైన్ రిపేర్లను సరిచేయాల్సి ఉండగా.. నేటికీ రిపేర్లు నత్తనడకన కొనసాగుతున్నాయి.

● ఎత్తిపోతల పథకాల నిర్వహణపై రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాలు కృష్ణానది నుంచి దాదాపు 10 నుంచి 20 కిలోమీటర్ల దూరం పైపులు ద్వారా ప్రవహించి ఎన్నెస్పీ కాలువలో కలుపుకుంటారు. ఈ పైపులు పాతవి కావడంతో ఎక్కువ ఒత్తిడికి లోనై, మధ్యలో పైపులు పగులుతుండడంతో పగిలిన పైపులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. నిర్లక్ష్యంతో ఒక్కసారి పైపు పగిలితే వారం పది రోజులు మరమ్మతులకు గురవుతున్నాయి. దారిలో ఉన్న పైపులు ధ్వంసమయితే వాటిని గుర్తించి, మరమ్మతులు చేయించడంలో జాప్యం చేస్తున్నారు. ఎత్తిపోతల పథకాల వద్ద ఉన్న ఆపరేటర్లు బాధ్యతారహితంగా వ్యవహరిస్తుండడంతో ఎత్తిపోతల పథకాల లక్ష్యం చేరుకోవడం లేదు. ఎత్తిపోతల పథకాలతో నేరుగా లబ్ధిచేకూరే పంట పొలాలతో పాటుగా ఈ ప్రాంతంలో భూగర్భజలాలు వృద్ధిచెందుతాయి. దీంతో పరోక్షంగా మరో 5060 ఎకరాలు అదనంగా బావులు, బోర్లు ద్వారా సాగులోకి వచ్చే అవకాశాలు ఉండడంతో మంత్రి ఆదేశాలతో ఈ పథకాలు పూర్తవుతాయని ఈ ప్రాంత రైతులు ఆశగా చూస్తున్నారు.



శివగంగ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నిధులు కేటాయిస్తే.. సస్యశ్యామలమే

నిలిచిపోయిన కంభాలపల్లి ఎత్తిపోతల పనులు





నిలిచిపోయిన అంభ భవాని ఎత్తిపోతల పథకం పనులు

దేవరకొండ /చందంపేట, పీఏపల్లి: నాగార్జునసాగర్‌లో ముంపునకు గురైన బాధితులు చందంపేట, నేరేడుగొమ్ము, పీఏపల్లి మండలాల్లోని గుట్టలపై ఉన్న గ్రామాల్లో పునరావాసం ఏర్పాటు చేసుకొని వర్షాధారంగానే పంటలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామాల రైతులకు లిఫ్టుల ద్వారా సాగునీరు అందించాలని 2021 ఫిబ్రవరి 10న అప్పటి సీఎం కేసీఆర్ ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేశారు. నిధులు కేటాయించకపోవడం, అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో కొన్ని లిఫ్టుల పనులు మందకొడిగా సాగుతున్నాయి. మరికొన్ని శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసే పరిస్థితి. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఉమ్మడి జిల్లాకు చెందిన నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయించారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించి, పూర్తిచేయాలని సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. లిఫ్టులు పూర్తయితే గుట్టలపై ఉన్న ప్రాంతాల రైతులకు సాగునీరు అందనుంది. రూ.585కోట్లతో నియోజకవర్గంలో ఐదు ఎత్తిపోతల పథకాల పనులకు శంకుస్థాపన చేశారు.

పొగిళ్ల ఎత్తిపోతల పథకం

● పొగిళ్ల ఎత్తిపోతలకు రూ.24.64 కోట్లు కేటాయించారు. ఈ పథకానికి అటవీశాఖ అనుమతి రాకపోవడంతో శంకుస్థాపనకే పరిమితమై ప్రారంభానికి నోచుకోలేదు. ఈ పథకం పూర్తయితే 1019 ఎకరాలకు సాగునీరు అందనుంది. సుమారు 40 ఎకరాల వరకు అటవీశాఖ అనుమతి రావలసి ఉందని అధికారులు తెలుపుతున్నారు.

కంబాలపల్లి ఎత్తిపోతల పథకం

● కంబాలపల్లి ఎత్తిపోతలకు రూ.202.15 కోట్లు కేటాయించారు. ఈ పథకం పనులు 20శాతం పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే కంభాలపల్లి, పాత కంభాలపల్లి, యలమలమంద, గువ్వలగుట్ట, కాచరాజుపల్లి గ్రామాలకు సాగునీరు అందుతుంది. 20వేల ఎకరాలకు నీరందుతుంది.

అంభభవాని ఎత్తిపోతల పథకం

● అంభభవాని ఎత్తిపోతలకు రూ.184.56 కోట్లు కేటాయించారు. ఈ ఎత్తిపోతల పథకం పనులు 30శాతం మాత్రమే పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు రూ. 50కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. ఈ పథకం కింద 8444 ఎకరాలు నీరందనుంది. వైజాగ్‌కాలనీ, చిన్నమునిగల్, పెద్దమునిగల్, బచ్చాపురం, బుడ్డోనితండా, కేతేపల్లి, మోసంగితండా, గుర్రపుతండా, పేర్వాల గ్రామాల్లోని సాగునీరు అందనుంది.

ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకం

● ఏకేబీఆర్ ఎత్తిపోతలకు రూ.90.96 కోట్లు కేటాయించారు. నిధులు మంజూరు చేయకపోవడంతో 4శాతం పనులు పూర్తికాగా పనులు కొనసాగుతున్నాయి. దీని ద్వారా గుర్రంపోడ్, గుడిపల్లి, పీఏపల్లి మండలాల్లో 6,691 ఎకరాల ఆయకట్టుకు నీరందేలా రూపకల్పన చేశారు. పెద్దగట్టు లిఫ్టు పనులు అటవీశాఖ అనుమతి రాకపోవడంతో సర్వే చేసి నిలిపి వేశారు. పనుల ప్రారంభంపై సందిగ్ధత ఏర్పడింది.

పెద్దగట్టు ఎత్తిపోతల పథకం

● పెద్దగట్టు ఎత్తిపోతలకు రూ.82.727 కోట్లు కేటాయించారు. దీని ద్వారా పెద్దగట్టు, ఎల్లాపురం, నంబాపురం గ్రామాల్లో మూడు వేల ఎకరాల ఆయకట్టుకు నీరందేలా రూపకల్పన చేశారు.

● కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కంభాలపల్లి, ఏకేబీఆర్, అంభ భవాని ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభమయ్యాయి. కాని కాంట్రాక్టర్ నిధులు కేటాయించడంలో జాప్యం జరుగుతుండడంతో ప్రస్తుతానికి కంభాలపల్లి అంభ భవాని ఎత్తిపోతల పథకం నిలిచిపోగా, ఏకేబీఆర్ ఎత్తిపోతల పనులు జరుగుతున్నాయి. లిఫ్టులు పూర్తయితేనే గుట్టలపై ఉన్న గ్రామాలకు సాగునీరు అందనుంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

నిధుల కేటాయింపుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. పొగిళ్ల ఎత్తిపోతల పథకానికి అటవీ అనుమతి రాకపోవడంతో పనులు ప్రారంభంకాలేదు. కంభాలపల్లి 20శాతం, అంభభవాని 30శాతం పనులు జరిగాయి. నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. అటవీశాఖ అనుమతులు కూడా రావల్సి ఉంది.

● శ్రీధర్‌రావు, ఈఈ.


కృష్ణానది పక్కనే ఉన్నా సాగునీటికి నోచుకోని దుస్థితి



కృష్ణానది పక్కనే ఉన్న సాగునీరు అందని పరిస్థితి. వర్షాధారంపైనే ఆధారం. సాగునీరు అందించాలి. నిధులు కేటాయించి పూర్తి చేయాలి.

● బొమ్ము శ్రీను, కంభాలపల్లి రైతు.

లిఫ్టు పూర్తిచేసి సాగునీరు అందించాలి



నాగార్జునసాగర్ ప్రాజెక్టులో భూములు కోల్పోయి గుట్టలపై ఉన్న కంభాలపల్లిలో పునరావాసం ఏర్పాటు చేసుకున్నాం. సాగునీరులేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రాజెక్టు పూర్తిచేసి నీరు అందించాలి.

● వాకునావత్ చందునాయక్, రైతు, కాచరాజుపల్లి.

పట్టు తప్పితే ప్రమాదమే...



ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న కూలీలు

చండూరు: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా.. పోలీసులు జరిమానాలు విధించినా కొందరు డ్రైవర్ల తీరు మారడం లేదు. ప్రజల అవసరాలను ఆసరగా చేసుకుని ఆటోల్లో పరిమితికి మించి తరిస్తున్నారు. పట్టు జారితే ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉన్నా ఆదాయమే ధ్యేయంగా డ్రైవర్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలను పరిమితికి మించి ఎక్కించుకుని తరలిస్తున్నారు. కనీసం ఆటో హ్యాండిల్ తిప్పేందుకు కూడా వీలు లేకుండా కూలీలను ఎక్కించుకుంటున్నారు. చండూరులో జరిగే సంతకు పరిసర గ్రామాల నుంచి సకాలంలో బస్సులు లేక ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. పోలీసులు, అధికారులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కన్నెకల్‌లో విషజ్వరాలు



కన్నెకల్‌లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ

మాడ్గులపల్లి: మండలంలోని కన్నెకల్ గ్రామంలో 20రోజులుగా విషజ్వరాలు పీడిస్తున్నాయి. గ్రామంలో ఎక్కువ మందికి జ్వరాలు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. గ్రామంలో సుమారు 1200 మంది జనాభా ఉన్నారు. ప్రతీ కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు చొప్పున సుమారు వంద మందికి జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. గ్రామంలో ఉన్న పల్లె దవాఖానా సిబ్బంది ఆసుపత్రికి వచ్చే వారికి మందులు ఇస్తున్నా తగ్గడం లేదు. కొంతమంది నల్లగొండ, మిర్యాలగూడ ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నా తగ్గడం లేదు. గ్రామంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో నీళ్ల నిల్వ ఉండటంతో పాటు దుర్వాసన రావడం, అపరిశుభ్రంగా ఉండడంతో విషజ్వరాలు సంభవిస్తున్నాయి. వైద్యాధికారులు గ్రామాన్ని సందర్శించి వైద్యశిబిరం నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భయం భయంగా విధులు



కుంగిన కార్యాలయం లోపలి భాగం

చండూరు: మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్యాలయంలో మొత్తం 8మంది విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయం లోపలి భాగం పూర్తిగా కుంగిపోయి పాములు, తేళ్లకు ఆవాసంగా మారింది. బునాది, మెట్టు పూర్తిగా కుంగిపోయి పగుళ్లు పట్టాయి. ఎప్పుడు కూలుతుందోనని భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం పక్కన ఉన్న గృహ నిర్మాణశాఖ భవనంలో వ్యవసాయశాఖ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. సొంతభవనం లేకపోయినా ఉన్న భవనాన్ని మరమ్మతులు చేపట్టాలని విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఓవర్ లోడ్‌తో ఇబ్బందులు



ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లు

కొండమల్లేపల్లి: గుర్రంపోడు మండలం పాల్వాయి కుంట నుంచి దాదాపు 20 టిప్పర్లతో నల్లరేగడి మట్టిని నెల రోజుల నుంచి కొండమల్లేపల్లి మీదుగా ఇబ్రహీంపట్నం వరకు తరలిస్తున్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆదివారం రోజు సంత నిర్వహిస్తుండటంతో కొండమల్లేపల్లిలో రద్దీ ఏర్పడుతుంది. ఓవర్ లోడ్‌తో వచ్చే నల్లమట్టి టిప్పర్లు పై భాగంలో మట్టి పెళ్లలు కూలి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఈ విషయమై మైనింగ్ డిపార్ట్‌మెంట్ ఏడీ జాకబ్‌ను మాట్లాడుతూ మట్టిని టిప్పర్ బాడీ లెవల్ మాత్రమే తీసుకెళ్లాలని అన్నారు. ఓవర్ లోడ్‌తో వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

కట్టంగూరు, జూలై 14: మండలంలోని చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన 50 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ నాయకులు దాసరి శంకర్, చె వుగోని నాగయ్య, సైదులు, అంజయ్య, మల్లేష్, దుర్గయ్య, రామస్వామితో పాటు మరికొందరు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు నంద్యాల వెంకట్‌రెడ్డి, ఎడ్ల పెద్దరాములు తదితరులు ఉన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ క్రీడ ఎంతో అవసరం



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, జూలై 14: ఆత్మరక్షణ కోసం బాల, బాలికలకు మార్షల్ క్రీడ ఎంతో ఉపయోగపడుతుందని నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రకాశంబజార్‌లో గల విన్నర్స్ తైక్వాండో అకాడమీలో నిర్వహించిన తైక్వాండో జిల్లాస్థాయి సబ్ జూనియర్, సీనియర్ క్రీడా పోటీలకు ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, యవకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల మానసిక ఆనందంతో పాటు, శారీరక ధృడత్వం ఏర్పడుతుందన్నారు. ఆటలతో చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు మంచి లక్షణాలు అలవడుతాయని అన్నారు. డీవైఎస్‌వో ఎండీ మగ్బూల్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. అనంతరం జరిగిన పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ది తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎండీ యూనుస్ కమాల్, కోశాధికారి అంబటి ప్రణీత్, సీనియర్ క్రీడాకారులు ఎండీ నసీరుద్దీన్, లోకేష్, అశోక్, సరయు, శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

మునుగోడు, జూలై 14: గంజాయి, మాదకద్రవ్యాలు వంటి మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి అందుబాటులోకి రావటంతో యువత ప్రధానంగా మైనర్ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై బహిరంగ ప్రదేశాల్లో వీరంగం సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి అధికారులు నియంత్రణ చర్యలు చేపటాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఎండీ. జానీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, దుబ్బ వెంకన్న, రేవెల్లి అంజయ్య, లింగస్వామి, ఎల్లస్వామి, నరేష్, యాదయ్య, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాడ్గులపల్లి, జూలై 14: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మాధవకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కన్నెకల్ గ్రామంలో కొన్ని రోజులుగా విషజ్వరాలతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా రోగాలను అరికట్టవచ్చన్నారు. ఆదేవిధంగా గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. సుమారు వంద మందికి పైగా పరీక్షలు నిర్వహించారు. ఎక్కువ మంది ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధపడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని వారికి తగు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కిరిబాయ్, జోసఫ్, భవాని, జ్యోతిక, ఏఎన్ఎం నాగలక్ష్మి, రోజా, ఆశాలు మంగమ్మ, మంజుల, లక్ష్మి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ కోసం పాటుపడతా

తిరుమలగిరి(సాగర్), జూలై 14: పదవిలో లేకున్నా ప్రజా సేవ కోసం నిరంతరం పాటు పడతానని తాజా మాజీ ఎంపీపీ అంగోతు భగవాన్‌నాయక్ అన్నారు. ఎంపీపీగా పదవీ బాధ్యతల విరమణ సందర్భంగా కృష్ణపట్టికు చెందిన పలు తండాలవాసులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకునితండాలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో భగవాన్‌నాయక్ చేసిన సేవలను కొనియాడారు. సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి సహకారంతో మండలంలో మిగిలిపోయిన సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషిచేస్తానని భగవాన్‌నాయక్ అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మెరావత్ మునినాయక్, మాజీ ఎంపీటీసీలు బీలునాయక్, హచ్చునాయక్, నాయకులు బిచ్చాలు, రంగసాయి, పాండునాయక్, జవహర్‌నాయక్, అమ్మునాయక్, శ్రీను, లచ్చు, స్వామి, మోతీ, కొండలు, సక్రు, బిచ్చు, హనుమ, దశరథ, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి

● *సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం*

నల్లగొండరూరల్, జూలై 14: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని, ప్రజల ఆశలని వమ్ము చేయకుండా పరిపాలన సాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ నిరంకుశ వైఖరికి ఫ్యూడల్ పాలన వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్ పట్టం కట్టారని అన్నారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని సూచించారు. ప్రతీ పేదవానికి కార్పొరేట్ వైద్యం అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో సక్రమంగా పనిచేయని డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని అన్నారు. పార్టీ నాయకుడు కెఎస్ రెడ్డి అధ్యక్షత జరిగిన సమావేశంలో నాయకులు పబ్బు వీరస్వామి, లెనిన్, సత్యనారాయణ పందిరి మదర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 80 వాహనాల పట్టివేత



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ రాంరెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ క్రైం, జూలై 14: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై నల్లగొండ పట్టణ పోలీసులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ కొలను శివరాంరెడ్డి పర్యవేక్షణలో నల్లగొండ పట్టణంలో శనివారం అర్ధరాత్రి వరకూ విస్తృత తనిఖీలు నిర్వహించారు. నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పీఎస్ సంయుక్తంగా 14 టీంలుగా ఏర్పడి నాకాబందీ నిర్వహించారు. సరైన ఆధారాలు, నెంబర్ ప్లేట్లు లేని దాదాపు 80 వాహనాలను పట్టుకున్నారు. అదే విధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న సుమారు 100మంది యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయా పీఎస్‌ల పరిధిలోనే వాటి వల్ల కలిగే అనర్థాలు, వారికి భవిష్యత్తులో జరిగే నష్టాలపై వారి తల్లిదండ్రుల సమక్షంలోనే కౌన్సిలింగ్ నిర్వహించారు. స్థానిక వన్‌టౌన్ పీఎస్‌లో కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా ప్రతీ రోజూ జిల్లా వ్యాప్తంగా ప్రజలకు రక్షణ, అండగా నిలిచేందుకు పని చేస్తున్నామని, ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

వర్షాల కోసం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

చింతపల్లి, నార్కట్‌పల్లి, జూలై 14: వర్షాలు కురవాలని కోరుతూ జిల్లాలోని చింతపల్లి, నార్కట్‌పల్లి మండలాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవతలకు నీరు పోసి బండపై వరద పాశం పోశారు.

● చింతపల్లి మండలంలోని హరిజనాపురం గ్రామస్థులు వరద పాశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్.చిరంజీవి, బి.శ్రీనయ్య, సప్పిడి ఇద్దయ్య, కంబాలపల్లి కృష్ణయ్య, మునుకు వెంకటయ్య, నగేష్, సురేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలోని చిన్నతుమ్మలగూడెంలో మహిళలు కప్ప కాముడు ఆడి వరదపాశం పోశారు. బిందెలతో నీళ్ల తెచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి రాజు, అరుణ, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.



చిన్నతుమ్మలగూడెంలో వరద పాశం పోస్తున్న మహిళలు

వైభవంగా ఆషాఢ మాస బోనాల మహోత్సవం



బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

నల్లగొండ కల్చరల్, జూలై 14: నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్‌రోడ్డు బైపాస్‌లో గల శ్రీ కల్యాణ కనకదుర్గమ్మ దేవాలయంలో ఆదివారం ఆషాఢ మాస బోనాల మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్చకస్వాములు శాస్త్రోక్తంగా అమ్మవారిని ప్రత్యేకంగా శాకాంబరీదేవీగా అలంకరించి పూజలు చేశారు. అదే విధంగా కొందరు మహిళలు కూరగాయల మాలలను అమ్మవారికి సమర్పించారు. చుట్టుపక్కల కాలనీలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రదక్షణలు చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, అమ్మవారి వేషధారణలు ఆకట్టుకున్నాయి. దీంతో ఆలయమంతా భక్తులతో సందడి చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సైదులుగౌడ్, పద్మ, దుర్గ, కార్తీక్‌గౌడ్, శంకర్, అర్చకస్వాములు రామకృష్ణాచార్యులు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

దత్తాశ్రమంలో లక్ష నామార్చన

మిర్యాలగూడటౌన్: పట్టణంలోని రైల్వేకాలనీ దత్తాశ్రమంలో లక్ష నామార్చన పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిర్డీ భక్త సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో హారతి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆషాఢ మాసాంతం ఆలయంలో నిత్యపూజలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నరేందర్, ప్రతాప్, సత్యనారాయణ, మట్టయ్య, జానకీరాం, విక్రమ్, రవి, నాగన్న, విజయ్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే సామేల్ జన్మదిన వేడుకలు



శాలిగౌరారంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాలిగౌరారం, జూలై 14: ఎమ్మెల్యే మందుల సామేల్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాదూరి శంకర్‌రెడ్డి, బండపెల్లి కొమరయ్య గౌడ్, ఎర్ర యాదగిరి, చింత ధనుంజయ్, భూపతి అంజయ్య, గూని వెంకటయ్య, నరిగే నర్సింహ, బండారు మల్లయ్య, కట్టంగూరి సురేందర్ రెడ్డి, తీరుపారి మల్లేష్, అల్లి సైదులు, సుల్తాన్, యల్లయ్య, ఫుల్పూరి దేవేందర్, మంగదుండ్ల శ్రీనివాస్, కడారి అంజయ్య, రంగు భిక్షం, వేముల గోపినాథ్, గుత్తా రవీందర్‌రెడ్డి, సతీష్, నరేష్, మహేష్, యాదగిరి, గోపినాథ్, గణేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు. తక్కళ్లపహాడ్‌లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కట్టంగూరి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సామల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కృష్ణా వాటర్ పైపు లీకేజీ

● *పట్టించుకోని అధికారులు*



భారత్ గార్డెన్ ఎదుట లీకేజీ అయిన కృష్ణా నీటి పైపులైన్

మర్రిగూడ, జూలై 14: గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కాల పరిమితి ముగియడంతో పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం అధికారులను కేటాయించింది. అధికారుల పాలనలో సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో కృష్ణా జలాల పైపులైన్లు లీకేజీ కావడంతో ప్రజలు మురికి నీరు తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో మిషన్ భగీరథ పైపులు పగలడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో భారత గార్డెన్ ఎదురుగా మెయిన్ పైపులైన్ పగిలిపోయి రెండు నెలలైనా లీకేజీతో రహదారి వెంట నీరు ప్రవహిస్తున్నా వాటికి మరమ్మతులు చేయాలని అధికారులు ఆలోచన చేయడం లేదు. ఈ పైపు లీకేజీ కావడంతో వాహనాలు తిరగడం వల్ల గుంతలు పడి నీరు నిల్వ ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెయిన్ రోడ్డుపై కృష్ణావాటర్ లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తక్కళ్లపల్లిలో తాగునీటి కోసం గ్రామస్థుల ఇక్కట్లు



పొలాల వద్ద నీటిని తెచ్చుకుంటున్న యువకులు

చింతపల్లి, జూలై 5: చింతపల్లి మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరుబావులతో పాటు మిషన్ భగీరథ పథకం ద్వారా కూడా మంచినీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో తాగునీటి కోసం వ్యవసాయ పొలాల్లోని ట్యాంకుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాక గ్రామంలో చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోయింది. వారం రోజులకు ఒకసారి అయినా చెత్త సేకరణ వాహనం రాకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రోగాల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. సీజనల్ వ్యా ధులు వ్యాప్తి చెందుతున్న ఈ సందర్భంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాల్సిన అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ విషయంపై మండల ప్రత్యేక అధికారి సక్కుబాయిని వివరణ కోరగా కార్యదర్శి సెలవులో ఉన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ధర్మాపురంలో యువతి అదృశ్యం

● *మిస్సింగ్ కేసు నమోదు*



అఫ్రీన్ (ఫైల్ ఫొటో)

నిడమనూరు, జూలై 14: మాడ్గులపల్లి మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో ఓ యువతి అదృశ్యమైంది. నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మాపురం గ్రామానికి చెందిన షేక్ మహమూద్‌కు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అఫ్రష్‌ను హైదరాబాద్ చెందిన సయ్యద్ షాజీపుల్లా హుస్సేన్‌తో నాలుగేళ్ల ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు కూడా ఉన్నాడు. మహమూద్ చిన్న కుమార్తె అఫ్రీన్ (25) డిగ్రీ వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటోంది. కాగా పెద్ద కుమార్తె, అల్లుడు మూడు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ధర్మాపురం వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున చిన్న కుమార్తె అఫ్రీన్ ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. చిన్నకుమార్తెతో పాటు పెద్ద కుమార్తె భర్త కూడా కనిపించడం లేదు. తన కుమార్తె కనిపించడం లేదని మహమూద్ నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గోపలాయపల్లిపై నేటి నుంచి యజ్ఞాలు

నార్కట్‌పల్లి, జూలై 14: మండలంలోని గోపలాయపల్లిలో హరిహర క్షేత్రంగా బాసిల్లుతున్న వారిజాల గుట్ట ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక ఉత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతీ ఆశీస్సులతో వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంపై యాగాలను చేయనున్నారు. శ్రీహరిహర వేదస్మార్త పాంచరాత్రాగమ పాఠశాల ప్రిన్సిపాల్ చేబియ్యం రాఘవశర్మ ఆధ్వర్యంలో, కృష్ణ ఘనాపాఠి బ్రహ్మత్వమున జరిగే సుదర్శన యాగ సహిత రుద్రయాగం, శ్రీ కృష్ణ యజుర్వేద, క్రమ స్వస్తిపూర్వక సంపూర్ణ వేద పారాయణం, రుగ్వేద పారాయణం సప్తాహ దీక్షతో వైభవంగా ఐదు రోజుల పాటు రోజుకో యజ్ఞ కృతువును నిర్వహించేలా దేవస్థానం వ్యవస్థాపక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఆలయ ఇన్‌చార్జి మేనేజర్ అంబటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15న గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, దీక్షారాధన, అగ్ని ప్రతిష్ఠలను చేయనున్నారు. సాయంత్రం సుదర్శన, రుద్రహోమాలతో పాటు లలిత సహస్ర నామార్చన, కుంకుమార్చన చేయనున్నారు. ఈ యాగ ప్రారంభ వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు హాజరు కానున్నట్లు దేవస్థాన చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

కేతేపల్లి: మండల కేంద్రం కేతేపల్లిలో ఇటీవల మృతి చెందిన ఇరువురి కుటుంబాలను ఎమ్మెల్యే వీరేశం పరామర్శించారు. గ్రామానికి చెందిన మారగోని ముత్తమ్మ, అయితగోని భిక్షమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు.

మాడ్గులపల్లి: మండలంలోని కల్వలపాలెం, పాములపాడు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పరామర్శించి ఓదార్చారు. మండలంలోని కల్వలపాలెం గ్రామానికి చెందిన తిరుగు వెంకన్నయాదవ్, పాములపాడు గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు బంటు సైదులు తండ్రి బంటు జానయ్య, అదే గ్రామానికి చెందిన సీతా కళమ్మ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను భాస్కర్‌రావు పరామర్శించి ఓదార్చారు.

నల్లగొండ: టీడీఎస్ చేయించి ఫాం-16ను పెన్షనర్లకు ఇవ్వాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలకూర్తి కృష్ణమూర్తి ప్రకటనలో కోరారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెన్షనర్‌ల నుంచి రికవరీ అయిన ఆదాయ పన్నుకు సంబంధించిన టీడీఎస్‌ను ఇంకా చేయలేదన్నారు. దీని వల్ల పెన్షన్ దారులు తమ ఆదాయపన్ను రిటర్న్‌లను వేయడానికి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు.

దేవరకొండ: దేవరకొండ మండలం పెంచికల్‌పహడ్ వద్ద ప్రభుత్వం పంపిణీ చేసిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు పూర్తిస్థాయిలో తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు డిమాండ్ చేశారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతచెట్టుతండా పరిధిలోని పూల్‌సింగ్‌తండాకు చెందిన నేనావత్ రమేష్‌నాయక్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతి చెందిన రమేష్ మిత్రులు స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో మొహర్రం వేడుకలకు పీర్లను సిద్ధం చేశారు. హిందూ ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా నిలిచే మొహర్రంను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

దేవరకొండ: కవులు, కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సహం అందించాలని దేవరకొండ నియోజకవర్గ సాహితి సాంస్కృతిక అధ్యయన వేదిక అధ్యక్షుడు పర్వావాసుదేవరావు అన్నారు. జానపద కళాకారులు ఉడుత సలేశ్వర్‌యాదవ్‌కు బహుజన సాహిత్య అకాడమి జాతీయ అవార్డు రావడంతో తెస్సా ఆధ్వర్యంలో సన్మానించి మాట్లాడారు. కవులు, కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో రంజాన్‌బేగ్, జీవ, జల్లా అంజనేయులు, బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో 1997-98 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదివిన ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.నర్సింహ, రేబాక, ప్రమీల, సునిత, పూర్వ విద్యార్థులు విజయ, ధనలక్ష్మీ, నాగమణి పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఉద్యాన అధికారి పిన్నపు అనంతరెడ్డి అన్నారు. మండలంలోని పూసలపాడు గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో జొన్నలగడ్డ రఘునాథరెడ్డి, బత్తుల చిన్నవెంకటయ్య వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. ఇప్పటివరకు మండలంలో 204 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో మొక్కలను నాటడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడ రూరల్: అవంతీపురంలో పారిశుధ్యం అస్తవ్యస్తం అనే శీర్షికపై వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో శేషగిరిశర్మ ఆదేశాల ప్రకారం గ్రామంలో డ్రైనేజీల్లోని చెత్తను తొలగించి మురుగును తొలగించారు. జంగాలకాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

చండూరు: రాష్ట్రంలో అమాయక ప్రజలను మోసం చేస్తూ కోట్లాది రూపాయలను దండుకుంటున్న స్పాట్‌లోన్, క్లౌడ్ టెన్నీకో యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ డిమాండ్ చేశారు.

మిర్యాలగూడ టౌన్: నేటి మొక్కలే రేపటి వృక్షాలని పర్యావరణ ప్రేమికుడు రావుల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద మొక్కల పెంపకంపై ఆదివారం ఫ్లకార్డులతో అవగాహన కల్పించారు.

మిర్యాలగూడ టౌన్: అవయవ దాతలు దేవుళ్లతో సమానమని వాసవీక్లబ్ డిస్ట్రిక్ట్ హెడ్ మిట్టపల్లి విజయభాస్కర్ అన్నారు. ఇటీవల మరణించిన పట్టణ యువకుడు బంటు మహేష్ అవయవాలను దానం చేసిన తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, మీనాక్షిలను సన్మానించారు.

కొండమల్లేపల్లి: మండలకేంద్రంలోని మల్లెలగట్టు కాలనీలో తెలంగాణ వ్యకాస కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

నల్లగొండ రూరల్: ఆత్మరక్షణ కోసం బాలికలు, మహిళలకు తైక్వాండో ఎంతో దోహదపడుతుందని పట్టణ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ విజయబాయి అన్నారు. పట్టణంలో తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఆమె ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడకారులు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు మంచిర్యాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

శివాలయంలో చోరీ

కట్టంగూరు, జూలై 14: కట్టంగూరు గ్రామ శివారులో 65వ నెంబర్ జాతీయ రహదారి వెంట ఉన్న శివాంజనేయ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఆలయం గేటు తాళం పగులగొట్టి ఆలయంలో ఉన్న సుమారు రూ.20 వేల విలువైన ఆంప్లిఫైర్ బాక్సును దొంగలించినట్లు ఆలయ పూజారి నర్సింగ్ భిక్షమాచారి తెలిపారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.